www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 21 ఆగస్టు 2025

5

ఏలూరు

నిరుపేద విద్యార్థులకు సాయం అందజేత

ప్రశంసించిన నితిన్ సాయి కనస్ట్రక్షన్స్ అధినేత కొలుసు నితిన్ కృష్ణ

ప్రజాశక్తి - చాట్రాయి

గత విద్యా సంవత్సరంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ నిరుపేద విద్యార్థులకు, చదువులో బాగా రాణించిన వారికి టిడిపి నేత ఎం.వెంకటేశ్వరరావు ఇచ్చిన మాట ప్రకారం టిడిపి యువ నేత, నితిన్ సాయి కనస్ట్రక్షన్స్ అధినేత కొలుసు నితిన్‌కృష్ణ చేతుల మీదుగా బుధవారం సాయం అందించారు. పోలవరంలో జరిగిన కార్యక్రమంలో రూ.75 వేలు ఆర్థిక సాయం విద్యార్థులకు అందజేశారు. తన గ్రామంలో చదువుకున్న విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తానని వెంకటేశ్వరరావు గత రిపబ్లిక డే వేడుకల్లో ప్రకటించారు. ఈ సందర్భంగా నితిన్‌కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యపట్ల ఉన్న ఆసక్తి, వారి కృషి, పట్టుదలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది, కూటమి నాయకులు ప్రసాదరావు, రమేష్, జయరాజు, ఆది, మాధవరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కిక్కే.. కిక్కు..!

మందుబాబులకు రేయింబవళ్లు పండగే

రెండు జిల్లాల్లో 48 బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల

28న లాటరీ తీయనున్న కలెక్టర్లు

ఇప్పటికే ఏరులై పారుతున్న మద్యం

బార్‌ల ఏర్పాటుతో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలకు అనుమతి

మద్యం దుకాణాలు, బార్‌ల కేటాయింపులో గీతకార్మికులకు అన్యాయం

ప్రజాశక్తి - భీమవరం

రెండు జిల్లాల్లో వేళాపాళా లేకుండా ఏ సమయంలోనైనా మద్యం ఏరులై పారుతోంది. ఇప్పటికే తాగినోడికి తాగినంత మద్యం అందుబాటులో ఉంటోంది. దీంతో మందుబాబులు మంచి జోష్‌లో ఉంటున్నారు. కొత్త మద్యం బార్‌ల పాలసీతో సమయంతో పని లేకుండా ఇక నుంచి మద్యం విచ్చలవిడిగా దొరకనుంది. ఈ నేపథ్యంలో మందుబాబులకు ఇక కిక్కే కిక్కు అనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం రాబడి చూసుకుంటుందే తప్ప ప్రజారోగ్యాన్ని గాలికొదిలేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత వైసిపి ప్రభుత్వం మద్యపానం నిషేధమంటూ ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. బ్రాండ్లతో సంబంధం లేకుండా ధరలు విపరీతంగా పెంచి మద్యం అమ్మకాలు సాగించింది. కూటమి ఎన్నికల హామీలో భాగంగా నూతన మద్యం పాలసీ తీసుకొచ్చింది. దీనిలో భాగంగా జిల్లాలో 175 మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. వీటికి తోడు బడి, గుడి అనే తేడా లేకుండా బెల్ట్ షాపులు కూడా పుట్టగొడుగుల్లా వెలిశాయి. జిల్లాలో నాలుగు వేలకుపైగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని అంచనా. దీంతో అంతటా మద్యం ఏరులై పారుతుంది. సమయంతో సంబంధం లేకుండా 24 గంటలూ మద్యం దొరుకుతుంది. దీంతో మందుబాబులు పుల్లుగా తాగుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా విక్రయాలు సాగిస్తున్నారు. ఇదంతా ప్రజాప్రతినిధులు, అధికారులు, కనుసన్నల్లోనే జరుగుతుండటం గమనార్హం. జిల్లాలో మద్యం ఏరులై పారడానికి కారణమైన నూతన మద్యం పాలసీకి.. కొత్త బార్‌ల పాలసీ తోడవుతుందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో 20, పశ్చిమగోదావరి జిల్లాలో 28 బార్‌ల ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం పట్టణంలో 7, నరసాపురంలో 3, పాలకొల్లులో 6, తణుకులో 6, ఆకివీడులో ఒక బార్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి బార్‌కు తప్పనిసరిగా నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ పద్ధతిలో లైసెన్సులు కేటాయిస్తారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. లాటరీలో ఎన్ని బార్లకైనా లైసెన్సులు పొందొచ్చు. ప్రతి దరఖాస్తుకూ రూ.5.10 లక్షల నాన్-రీఫండబుల్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలి. 28వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో లైసెన్స్‌లు కేటాయించనున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి జిల్లాలో నూతన మద్యం బార్‌లు ప్రారంభం కానున్నాయి.

28న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ

ఈ నెల 28వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీస్తారు. ఎంపికైన వారు అదే రోజు మొదటి విడత సొమ్ము కట్టి మరో విడత సొమ్ముకు సంబంధించి గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంది. లాటరీలో ఎంపికైన వారు ఒరిజినల్ లైసెన్స్ తీసుకుని 15 రోజుల్లో బార్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఏడాదికి రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ 50 వేల లోపు జనాభా గల బార్లకు రూ.35 లక్షలు, ఐదు లక్షల జనాభాలోపు రూ.55 లక్షలు, ఐదు లక్షలు జనాభా దాటిన తర్వాత రూ.75 లక్షలుగా నిర్ణయించారు. ప్రతియేటా 10 శాతం ఫీజు పెరుగుతుంది. గీత కార్మిక సామాజిక తరగతులకు సంబంధించిన బార్‌లకు మాత్రం 50 శాతమే వసూలు చేస్తారు.

అర్ధరాత్రి వరకు అనుమతి

గత ప్రభుత్వ హయాంలో మద్యం బార్‌ల లైసెన్సు ఫీజులు భారీగా ఉండటంతోపాటు బార్ తెరిచి ఉంచే వేళలు కుదించారు. ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకే బార్‌లకు అనుమతి ఉండేది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం బార్‌లు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇచ్చింది. అంటే మద్యం దుకాణాలు మూసేసిన తర్వాత కూడా రెండు గంటలపాటు బార్‌లలో మద్యం అందుబాటులో ఉండనుంది. మొత్తంగా నూతన బార్‌ల పాలసీలో మందుబాబులకు అర్ధరాత్రి వరకు తాగించి ఆదాయం పెంచుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. మద్యం దుకాణాలను దక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించిన కూటమి నేతలు బార్‌లను సైతం తమ గుప్పెట్లో ఉంచుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. ఒకవేళ వేరే వాళ్లకు వచ్చినా తమను వాటాదారులుగా చేర్చుకోవాల్సిందేనని సంకేతాలు పంపిస్తున్నట్లు సమాచారం.

కల్లుగీత కార్మికులకు తీవ్ర అన్యాయం

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీలో కల్లుగీత కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగింది. అరకొరగా మద్యం షాపులను కేటాయించి మొండిచెయ్యి చూపించింది. ఇక బార్‌ల పాలసీలోనూ మళ్లీ అదే జరిగింది. ఏలూరు జిల్లాలో రెండు, పశ్చిమలో రెండు బార్‌లను మాత్రమే గీతకార్మిక సామాజిక తరగతులకు కేటాయించి చేతులు దులుపుకుంది. రెండు జిల్లాల్లో వేలాది మంది కార్మికులు గీత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో గీత కార్మికులకు అండగా ఉంటామని కూటమి నేతలు హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించింది. చివరకు మద్యం దుకాణాల కేటాయింపుల్లోనూ గీత కార్మికుల పట్ల వివక్ష చూపిందనే విమర్శలు విన్పిస్తున్నాయి.



కుక్కునూరు: దాచారం-కుక్కునూరు ప్రధాన రహదారిపైకి చేరిన వరద నీరు

వరద గోదావరి..

ఆందోళనలో విలీన మండలాల, లంక గ్రామాల ప్రజలు

విలీన మండలాల్లో పలు గ్రామాలకు రాకపోకలు బంద్

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఉరకలేస్తోంది. బుధవారం సాయంత్రానికి గోదావరి వరద తీవ్ర రూపం దాల్చింది. కడెం, మంజీర, హరిద్ర, ఇంద్రావతి, మానేరు, ప్రాణహిత, కిన్నెరసాని, శబరి, సీలేరు ఉపనదులు పొంగి గోదావరిలో కలుస్తున్నాయి. దీంతో గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 8,78,421 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 32.100 మీటర్లు, స్పిల్వే దిగువన 23.520 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.

వేలేరుపాడు: వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

వేలేరుపాడు: అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

వేలేరుపాడు రూరల్: మండలంలో గోదావరి పరివాహక ప్రాంతాలైన రుద్రమ్మకోట, రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము గ్రామాల వద్ద గోదావరి ఒడ్డును ఆనుకుని ప్రవహిస్తుండటంతో విలీన గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే రుద్రమకోట, వేలేరుపాడు నుంచి నుంచి కోయిదా వెళ్లే మార్గంలో ఎక్కడికక్కడ వాగులు ఉప్పొంగడంతో నాళ్లవరం, ఎడవల్లి, టేకూరు, కోయిదా, కాచారం తదితర 20 గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. వరద మరింత పెరిగే అవకాశం ఉందనే హెచ్చరికలతో ప్రజలు సామగ్రిని తీసుకుని పిల్లా పాపలతో పునరావాస కాలనీలకు తరలి వెళ్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్, ఎస్‌పి

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ సూచించారు. గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన రేపాకగొమ్ము, ఎద్దువాగు వద్ద బుధవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. రేపాకగొమ్ము గ్రామంలో సుమారు 50 కుటుంబాలను చల్లావారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీకి, నెమలిపేటలోని ఆర్అండ్ఆర్ కాలనీకి తరలించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేశామని చెప్పారు. రహదారులు దిగ్బంధం కాకముందే సురక్షిత ప్రాంతాలకు తరలాలని రేపాకగొమ్ము ప్రజలకు సూచించారు. అనంతరం వేలేరుపాడు, రుద్రమ్మకోట గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద పరిస్థితిని పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల కోసం బ్రిడ్జి వద్ద అధికారులు లాంచీని ఏర్పాటు చేశారు. వారివెంట పోలవరం డిఎస్‌పి వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ వెంకటరమణ, కుక్కునూరు సిఐ రమేష్‌బాబు, వేలేరుపాడు ఎస్ఐ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కుక్కునూరు రూరల్: గోదావరి వరద ఉధృతితో ఇప్పటికే కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే నీట మునగ్గా, బుధవారం ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై కాజ్‌వేను వరద నీరు ముంచెత్తింది. దీంతో మరో 15 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఇప్పటికే గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని గత నెలలోనే అధికారులు గొమ్ముగూడేనికి చెందిన 130 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు. తాజాగా మళ్లీ వరద పెరుగుతుండటంతో గ్రామంలోని 123 కుటుంబాలు రావికుంట పునరావాస కేంద్రానికి తరలివచ్చాయి. వరద మరింత పెరిగితే మండలంలోని సీతారామనగరం-శ్రీధర మధ్య రహదారిపైకి నీరు చేరుతుంది. దీంతో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, బాపన్నగూడెం, లచ్చిగూడెం, కుక్కునూరు ఎ బ్లాక్‌కు చెందిన కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలాల్సి ఉంటుంది.

దాచారం పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

మండలంలోని గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటించారు. మండలంలోని దాచారం పునరావాస కాలనీలో ఉంటున్న గొమ్ముగూడెం వరద బాధిత కుటుంబాలను కలిసి వారికి ప్రభుత్వం నుండి అందుతున్న సాయం గురించి అడిగి తెలుసుకున్నారు. వరద తగ్గే వరకు అవసరమైన బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు అందిస్తామని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ఉధృతి

ఐక్య పోరాటాలతోనే చట్టాలు, హక్కుల పరిరక్షణ

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఐక్య పోరాటాలతోనే చట్టాలు, హక్కులు పరిరక్షించుకోగలమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ఆరో మహాసభ స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం యర్రా రాంబాబు అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభ సూచికంగా యూనియన్ జెండాను సిహెచ్.కొండలరావు ఆవిష్కరించారు. మహాసభను సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ప్రారంభించారు. తొలుత ఇటీవల మరణించిన కార్మిక సంఘ నేతలకు నివాళులర్పించారు. అనంతరం మూడు సంవత్సరాల కార్యకలాపాల నివేదికను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ప్రవేశపెట్టారు. ప్రతినిధులు చర్చించి, నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడితేనే కార్మికచట్టాలను రక్షించుకోగలమన్నారు. కార్మికులందరూ ఐక్యం కావాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల సభల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. సెప్టెంబర్ 15న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించి, సంక్షేమ బోర్డు కార్యాలయం ముట్టడిస్తామని, చలో విజయవాడ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నేత నారపల్లి రమణారావు

పామాయిల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పామాయిల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోతున్న పామాయిల్ కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు వారికి ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం వెంటనే పామాయిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, గుర్తించిన పామాయిల్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, శాశ్వత వికలాంగులుగా మారిన వారికి ప్రభుత్వం పెన్షన్ అమలు చేయాలని కోరారు. పనిలో ప్రమాదం సంభవిస్తే వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని పేర్కొన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు పని దినాలకు పరిహారం ఇవ్వాలని, పామాయిల్ కార్మికుల కనీస వేతనం రోజుకు రూ.వెయ్యి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు పనిముట్లు, ఇతర సౌకర్యాలు సబ్సిడీకే అందించాలని తెలిపారు. విద్యుత్, ఉద్యాన శాఖల ద్వారా ప్రమాదాలు జరిగిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని, పామాయిల్ కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఫ్యాక్టరీ యజమానుల నుండి నష్టపరిహారం ఇప్పించాలని, విద్యుత్ శాఖకు, ఉద్యాన శాఖకు ఉత్తర్వులు ఇచ్చి కార్మికులందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

'స్త్రీ శక్తి'కి అపూర్వ స్పందన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకానికి అపూర్వ స్పందన లభిస్తోందని ఎపిఎస్‌ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. బుధవారం జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న 'స్త్రీ శక్తి' ప్రభుత్వానికి భారం కాదని, బాధ్యత అని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి పథకాన్నీ అవహేళన చేయడమే వైసిపి పనిగా పెట్టుకుందని ఆయన మండిపడ్డారు. సరాసరిన రోజుకు రాష్ట్రంలో 18 లక్షల మంది చొప్పున మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారన్నారు. విజయవాడ జోన్ పరిధిలో ఈ నాలుగు రోజుల్లో 16,60,032 మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. తద్వారా మహిళలకు రోజుకు రూ.6.30 కోట్లు లబ్ధి చేకూరుతుందన్నారు. సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, జనసేన నగర ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, రెడ్డి గౌరీ శంకర్, వీరంకి పండు, రవి, బోండా రామునాయుడు, జి.నాగమణి పాల్గొన్నారు.

పెన్షన్ తొలగింపు నోటీసులు

ద్వారకాతిరుమల: మండలంలోని 20 సచివాలయాలు, 28 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన వికలాంగ, ఆరోగ్య పింఛన్లు వెరిఫై చేసి పలు పింఛన్లను నిలుపుదల చేస్తూ లబ్ధిదారులకు గ్రామ కార్యదర్శులు నోటీసులు అందించారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపిడిఒ పివివి.ప్రకాష్ మాట్లాడుతూ మొత్తం 48 ఆరోగ్య పెన్షన్లు పరిశీలించగా వాటిలో ఎలిజిబుల్ 19 కాగా, 21 పెన్షన్లు పిహెచ్‌సి డిజెబుల్డ్ రూ.ఆరు వేలు పెన్షన్‌గా మార్పు చేసినట్లు తెలిపారు. ఒక పెన్షన్ వృద్ధాప్యం పింఛన్‌గా మార్పు చేయగా ఏడు పెన్షన్లు తిరస్కరించినట్లు తెలిపారు. మొత్తం వికలాంగుల పెన్షన్లు 1,306 కాగా 1,223 వెరిఫై చేశామని, ఇంకా 83 వెరిఫై చేయాల్సి ఉందని చెప్పారు. వెరిఫై చేసిన 1,223 పింఛన్లలో 1,018 అర్హత అని, 11 పెన్షన్లు వృద్ధాప్యం పింఛన్లుగా మార్పు చేశామని, 277 పెన్షన్లు తిరస్కరించామని తెలిపారు. అభ్యంతరాలపై నోటీసు అందిన 30 రోజుల్లోపు మెడికల్ సర్టిఫికెట్, ఇతర ధ్రువ పత్రాలతో ఎంపిడిఒ కార్యాలయంలో అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు.

పామాయిల్ గెలలు కోసేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

ఎస్ఐ ఎం.జయబాబు

ప్రజాశక్తి - టి.నరసాపురం

పామాయిల్ గెలలు కోసే సమయంలో రైతులు, కార్మికులు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్ఐ ఎం.జయబాబు సూచించారు. స్థానిక శివాలయం కళ్యాణ మండపంలో బుధవారం పామాయిల్ తోటల రైతులకు విద్యుత్ శాఖ, నవ భారత్ కంపెనీ వారి సమన్వయంతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పామాయిల్ పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులందరూ పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యుత్ తీగల దగ్గర పామాయిల్ కోయకూడదన్నారు. గెలలు కోయడానికి ముందు ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ లైన్ల గురించి జాగ్రత్తగా పరిశీలించాలని, అవసరమైతే విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇచ్చి కరెంటు నిలిపివేశాక కోయాలని చెప్పారు. పొడవైన ఇనుప కత్తులు, రాడ్లు ఉపయోగించొద్దన్నారు. కోత సమయంలో రబ్బరు గ్లౌజులు, బూట్లు వంటివి ధరించి పని చేయాలని, ఒక్కరే కాకుండా, ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది కలిసి పని చేయాలని సూచించారు. విద్యుత్ షాక్‌కు గురైనప్పుడు వెంటనే 108 అంబులెన్స్, విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాట్లాడుతున్న ఎస్ఐ జయబాబు

వరదలను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం

ఆయా నివాసిత ప్రాంతాల్లో 3 నెలల రేషన్ నిల్వలు సిద్ధం

కలెక్టరేట్, వేలేరుపాడు, కుక్కునూరులో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ, అర్బన్

గోదావరి వరద ఉధృతి రీత్యా జిల్లాలో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె గోదావరి వరద ప్రభావం, పునరావాస కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందన్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతున్న దృష్ట్యా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. వరదల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి, పశుసంపద నష్టం వాటిల్లకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. రహదారి అనుసంధానం కోల్పోయిన గ్రామాల ప్రజలకు కూరగాయలు, నిత్యావసరాలు గురువారం ఉదయం నుంచి బోట్లు ద్వారా అందజేస్తామన్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో 1800 233 1077, 9491041419, వేలేరుపాడులో 8328696546, కుక్కునూరులో 8096274662 నెంబర్లతో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎస్‌డిఆర్ఎఫ్ ద్వారా సమర్థవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ప్రతి మూడు గంటలకు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. టార్పాలిన్స్ కూడా సిద్ధం చేసి అవసరమైన వారికి అందిస్తున్నామన్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిన ఆర్అండ్ఆర్ కాలనీల్లో మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ముంపు ప్రాంతాల నుంచి గర్భిణులను ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. వేలేరుపాడు మండలంలో తొమ్మిది గ్రామాలకు సంబంధించి 15 హేబిటేషన్లు వరద నీటిమూలంగా రోడ్డు రవాణా నిలిచిపోయిందన్నారు. ఎద్దువాగు, టేకూరువాగు, తాట్కూరుగొమ్ము, సుద్దగుంపు, నార్లవార ంకాలనీ జంక్షన్, రుద్రమకోట, కోయిదా పిహెచ్‌సి పరిధిలో 9 మోటారు బోటులను అందుబాటులో ఉంచామన్నారు. 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో పంచదారతోపాటు కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు చొప్పున బాధిత కుటుంబాలకు అందించేందుకు నిల్వలను అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్లు, క్లీనర్లను ఇఎస్ఐలో చేర్చాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇఎస్ఐలో నమోదు కాని ఉద్యోగులు, కార్మికులను సభ్యులుగా చేర్చడానికి చేపట్టిన ప్రత్యేక నమోదు కార్యక్రమం స్ప్రీ పథకంలో మున్సిపల్ స్కూల్ స్వీపర్లను, టాయిలెట్ క్లీనర్లను చేర్చాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ ఇఎస్ఐ అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం యూనియన్ గౌరవాధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్షులు లావేటి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి అంగులూరి జాన్‌బాబు మున్సిపల్ స్కూల్స్ స్వీపర్లతో కలిసి ఇఎస్ఐ జిల్లా మేనేజర్ కె.లక్ష్మీబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ స్కూల్స్ స్వీపర్లు, టాయిలెట్ క్లీనర్లు నిత్యం దుమ్ము, ధూళి, దుర్గంధంలో పని చేస్తున్నారని, వీరు అనారోగ్యం పాలైతే ఎలాంటి వైద్య సౌకర్యాలు లేవని తెలిపారు. అందువల్ల మున్సిపల్ స్కూల్ స్వీపర్లను, టాయిలెట్ క్లీనర్లను కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయిర్స్ అండ్ ఎంప్లాయీస్ పథకం ద్వారా ఇఎస్ఐలో సభ్యులుగా చేర్పించి కార్మికులకు, వారి కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు, ప్రమాద బీమా సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే ఏలూరు మున్సిపాల్టీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు దాదాపు వెయ్యి మందికి తమ పోరాటం ద్వారా ఇఎస్ఐ అమలువుతుందని తెలిపారు. అధికారులు, ప్రభుత్వం స్పందించని పక్షంలో స్కూల్ స్వీపర్లు, టాయిలెట్ క్లీనర్లకు ఇఎస్ఐ అమలు కోసం ఉద్యమం చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎస్.కృష్ణవేణి, చలమల విజయలక్ష్మి, ఆంతోని, ఖాదర్ ఉన్నీసా, లక్ష్మీరాజ్యం, ప్రమీల, వెంకటరమణ, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న నేతలు, కార్మికులు

రైతు సంక్షేమానికి కృషి : మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీరందించేందుకు కృషి చేసినట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ నుంచి పాడేరు రిజర్వాయర్‌కు సుమారు 700 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో సాగు కోసం 700 క్యూసెక్కుల నీరు రామచంద్రపురం 117 కాలువకు గత ఆరు రోజుల క్రితం చేరుకోగా నూజివీడు, వేంపాడు కాలువలకు సాగు నీరు సరిపోదని, పెంచాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొన్నారు. గతంలో పాడేరు వద్ద గండి పడటంతో గట్టు పూర్తిగా పాడైందని, గట్టు పటిష్టంగా లేని వల్లనే నీరు అధికశాతం విడుదల చేయలేమని తెలంగాణ ప్రభుత్వం తెలియజేసిందని పేర్కొన్నారు. దీంతో తన సొంత నిధులు సుమారు రూ.1.30 లక్షలతో యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి పూర్తి చేసినట్లు తెలిపారు. డిసి చైర్మన్, అధికారులతో మాట్లాడి వెంటనే ఆ గండిని పటిష్ట చేయాలని ఆదేశించడంతో రెండు శ్రమించి పనులు పూర్తి చేశారని తెలిపారు. గట్టు పటిష్ట పనులు పూర్తికావడంతో అధికంగా సుమారు 800 క్యూసెక్కుల సాగునీరు మొత్తం కలిపి సుమారు 1500 క్యూసెక్కుల సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. సుమారు ఈ ఆయకట్టుకు 2.70 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని తెలిపారు. రానున్న రెండు, మూడు రోజుల్లో చాట్రాయి, ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి రైతులకు సాగునీరు పుష్కలంగా అందుతుందని తెలిపారు.

బాధిత కుటుంబానికి సొసైటీ సాయం

ప్రజాశక్తి - ముసునూరు

సొసైటీలో రుణం తీసుకున్న రైతు మరణిస్తే, ఆ రైతు కుటుంబానికి ప్రభుత్వం నుంచి సొసైటీ ద్వారా కొంత మేర నగదు ఆర్థిక సహాయం అందిస్తామని ముసునూరు సొసైటీ చైర్మన్ దేవినేని శ్రీధర్ చెప్పారు. సొసైటీ లబ్ధిదారులు రైతు రెడ్డి నరసింహారావు పది రోజుల క్రితం మృతి చెందారు. రైతు భార్యకు శ్రీధర్ సొసైటీ తరఫున రూ.పది వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి, ఉప సర్పంచ్ తోట శ్రీను, బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్క యోహాను, డైరెక్టర్ కాటంరాజు, సొసైటీ సెక్రటరీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - ముసునూరు

మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు చెప్పారు. మండలంలోని గోపవరం ఎంపిపి ఉన్నత పాఠశాలలో మోడల్ స్కూల్‌గా ఆధునీకరించటంతో విద్యార్థులకు చేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఖరీఫ్ సీజన్‌లో వరి పంట అధిక దిగుబడి పొందాలంటే రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి అక్కినేని చాముండేశ్వరి చెప్పారు. మండలంలోని చింతలవల్లి, గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు కౌలు కార్డు తీసుకోవాలని, ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

25న మహాధర్నా జయప్రదానికి పిలుపు

ముదినేపల్లి :పాత పెన్షన్ సాధన కోసం ఈ నెల 25వ తేదీ సోమవారం విజయవాడలో జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ముదినేపల్లి మండల ఉపాధ్యాయులను కోరారు. ముదినేపల్లి విద్యా శాఖ కార్యాలయం వద్ద మండలంలోని డిఎస్‌సి-2003 ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌సి-2003 కృష్ణా జిల్లా ఫోరం మహిళా కన్వీనర్ రమీజున్నీసా, వీరేంద్రబాబు, దుర్గాప్రసాద్, వెంకటరత్నం, లక్ష్మీవసు, యుటిఎఫ్ నాయకులు సాయి లక్ష్మి, సత్యనారాయణ, గణేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

మండవల్లి :ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మానవత స్వచ్ఛంద సంస్థ మండవల్లి మండలాధ్యక్షులు గుడివాడ గణేష్ స్పష్టం చేశారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించే విధంగా మానవత ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు స్టీల్ గ్లాసులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిర్మూలించే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెరియర్ గైడెన్స్ డైరెక్టర్ సుధామ ఫౌండేషన్ అధినేత డాక్టర్ సుధాబత్తుల విజయ్‌కుమార్, ముళ్లపూడి సత్తిబాబుచ, బొల్లంపల్లి కృష్ణారావు, కోనపురెడ్డి కోటేశ్వరరావు, పరిశోధన బాబు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బహిర్భూమికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన దెందులూరు మండలంలోని కొవ్వలి ప్రాంతంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దెందులూరు మండలం కొవ్వలి ప్రాంతానికి చెందిన కానూరు అభిషేక్ (18) స్థానికంగా తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి చెరువుగట్టుకు బహిర్భూమికి స్నేహితుడితో కలిసి వెళ్లాడు. అభిషేక్ ఒకసారిగా చెరువులో పడిపోయాడు. స్నేహితుడు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఉపయోగం లేకుండాపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దెందులూరు ఎస్ఐ ఆర్.శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - పోలవరం

భర్తతో గొడవపడి ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోలవరంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలవరం ఎస్ఐఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పాతపట్టిసీమ గ్రామానికి చెందిన కిలపర్తి విజయ (40) తన భర్త శేఖర్ పోలవరంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల కన్నాపురం అడ్డరోడ్డు వద్ద ఉన్న వారి పాన్‌షాపు ఆక్రమణలో తొలగించడం, జీవనోపాధి దెబ్బతినడంతో తన భర్తతో రాజమహేంద్రవరం వెళ్లి అక్కడే వ్యాపారం చేసుకుందామనే విషయంలో భార్యాభర్తల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన విజయ మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు కిలపర్తి ఈశ్వరసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా... ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కుక్క అడ్డు రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఆటో డ్రైవర్‌తో సహా ఆరుగురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున ఏలూరు శనివారపుపేట కాజ్ వే వద్ద చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. నగరంలోని శ్రీరామ్‌నగర్ 12వ రోడ్డులో వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని బంధువులు విజయనగరంలో ఉన్నారు. విజయనగరానికి చెందిన ఎనిమిది మంది ఏలూరులో ఆ మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌కు బుధవారం తెల్లవారుజామున చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో శ్రీరామ్‌నగర్‌కు వస్తున్న సమయంలో శనివారపుేట కాజ్ వే వద్దకు చేరుకునేసరికి ఆటోకు అడ్డుగా కుక్క రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు గాయాలపాలయ్యారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు మూడో పట్టణ ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కన్పించడంలేదని భర్త ఫిర్యాదు

జీలుగుమిల్లి :భార్య కనిపించడందని భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాటిరామన్నగూడెం గ్రామానికి చెందిన సిహెచ్.వీరయ్యకు 15 ఏళ్ల క్రితం పెళ్లి అయింది. ఈ క్రమంలో ఇటీవల ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీలో లోన్ తీసుకోగా ఆ నగదు విషయంలో భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. కోపోద్రిక్తులైన తన భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు వీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆంగ్లాంధ్ర భాషల్లో టీచర్ నరసయ్య కృషి

'యూ కెన్ స్పీక్ ఇన్ ఇంగ్లీషు" పుస్తకం రచించిన ఉపాధ్యాయుడు

24 పదాలు, 48 వాక్యాలతో సులభంగా నేర్చుకునేలా రచన

డివి నరసయ్య

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఎవరైనా ఏ రంగంలోనైనా ఆంగ్లంలో సరైన పట్టు సాధించకపోవడంతో ఉన్నత స్థానాలకు వెళ్లడం కష్టంగా ఉందని బొమ్మినంపాడు-కొత్త మాలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివి.నరసయ్య అన్నారు. బొమ్మినంపాడులో ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆంగ్లం భాష సమస్య అధికంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు పట్టు లేక ఎన్నో ఇబ్బందులు పడుతూ ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులకు కూడా వెళ్తూ ఆ భాషపై పట్టు పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఇలాంటి వారి సంఖ్య పల్లెలతో పాటు పట్టణాలు, నగరాల్లో కూడా పెరిగిందన్నారు.

టీచర్లకు శిక్షణ ఇస్తున్న నరసయ్య

అలాంటి వారందరికీ ఉపయుక్తంగా ఉండేలా ప్రత్యేకంగా పుస్తకాన్ని రచించానన్నారు. కేవలం 24 పదాలు 48 వాక్యాలతో సులభంగా ఆంగ్లం నేర్చుకోవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ఆంగ్లంలో మాట్లాడాలనే ధ్యేయంతో 'యూ కెన్ స్పీక్ ఇన్ ఇంగ్లీషు" అనే పుస్తకాన్ని రూపొందించానన్నారు. కేవలం 24 చిన్న చిన్న పదాలు..48 వాక్యాలను ఉపయోగించి ఆంగ్లం ఎలా నేర్చుకోవచ్చనేది స వివరంగా తెలి యజేశానన్నారు. విద్యార్థులకే కాకుండా ఉపాధ్యాయులకు ఈ ఆంగ్ల పుస్తకం ఎంతగానో దోహద పడుతుందన్నారు. కైక లూరులో కొన్నేళ్లుగా ఉచితంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ నిర్వహిస్తున్నారన్నారు. ఈ పుస్తకం మలి ప్రచురణ సైతం జరిగిందన్నారు. సాహిత్య రంగంలో ఎన్నో కవితలు, కథలు రాశానని, కవితా సమ్మేళనాల్లో ప్రతిభ చాటానని చెప్పారు. పలు కవితా సంపుటిల్లో తన ప్రతిభకు చోటు దక్కిందని, నందిగామలో నంది కళావాహిని నిర్వహించిన కవితా పోటీల్లో ఉగాది పురస్కారం అందుకున్నానని తెలిపారు. కైకలూరు సాహితీ మిత్రులు ఏర్పాటుచేసిన పలు ఉగాది కార్యక్రమాల్లో తన కవితలను వినిపించానన్నారు. ఇప్పటివరకు రచించిన కవితలు, కథలను పుస్తక రూపంలో తీసుకురావాలని భావిస్తున్నానన్నారు.

యూ కెన్ స్పీక్ ఇన్ ఇంగ్లీషు పుస్తకం, స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా అనేక మాడ్యూల్ ప్రిపరేషన్ వర్క్‌షాపులో పాల్గొన్నానన్నారు. ఎస్ఆర్‌పిగా, డిఆర్‌పిగా, ఎంఆర్‌పిగా, కెఆర్‌పిగా ఎంతోమంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనలో మెళకువలు నేర్పానన్నారు. మోడల్ ప్రైమరీ స్కూలులో పనిచేస్తున్న ఇంగ్లీష్ బోధించే టీచర్లకు శిక్షణ ఇవ్వడానికి ఎపి తరపున ఎస్ఆర్‌పిగా, ఆర్ఐఇఎస్ఐలో పది రోజుల పాటు వర్క్‌షాపులో పాల్గొన్నానన్నారు. ఇదే సంస్థలో సిఇఎల్‌టి కోర్సు చేసి ఎందరో టీచర్లకు ఆంగ్లంలో శిక్షణ ఇస్తున్నానన్నారు. ఆంగ్ల భాషలోనే కాకుండా మాతృభాష అయిన తెలుగులో కూడా పట్టు సాధించి కవిగా, రచయితగా అనేక కవి సమ్మేళనాల్లో పాల్గొని ప్రశంస పత్రాలు అందుకున్నానన్నారు.

శ్రీశ్రీ కళావేదిక, ఆదరణాలయ ట్రస్టు, సీసీ టీవీ సంస్థ పిలాంత్రపికల్ సొసైటీ, నన్నయ యూనివర్సిటీ తెలుగు శాఖ వారు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందించారన్నారు. తెలుగుతేజం అవార్డును, నందిగామ నంది కళావాహిని వారిచే ఉగాది పురస్కారం, 2012లో మండల ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు, 2016లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నానన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఇండక్షన్ శిక్షణ ఇచ్చానని చెప్పారు. ఇంటర్నేషనల్ థియోలాజికల్ సొసైటీ ద్వారా గౌరవ డాక్టరేట్ ఆఫ్ దివినిటీని అందుకున్నానన్నారు. డాక్టర్ రావూరి భరద్వాజ రాష్ట్రస్థాయి స్మారక పురస్కారాన్ని అందుకున్నానన్నారు. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా "యూకెన్ స్పీక్ ఇన్ ఇంగ్లీష్' పుస్తకాన్ని రచించానని తెలిపారు. ఈ పుస్తకాన్ని అప్పటి ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, బి.నాగేశ్వరరావులు ఆవిష్కరించారన్నారు. ఎంతోమందికి స్పోకెన్ ఇంగ్లీస్ లో శిక్షణ ఇచ్చినందుకు గర్వంగా ఉందని తెలిపారు.

క్షయపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా టిబి యూనిట్ సహకారంతో విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. పూర్వంతో పోలిస్తే క్షయవ్యాధి ఎంతో అదుపులో ఉందని, పూర్తిగా నిర్మూలించడానికి భారత ప్రభుత్వం టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ పిపిఎం కో-ఆర్డినేటర్ ఎస్.అరుణ భూపతి, టిబి సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేశాయి నాథ్ వర్మ, టిఒ ఎస్‌జెసికె.సాగర్, జిల్లా కోఆర్డినేటర్ జి.రఘు పాల్గొని విద్యార్థులకు క్షయ వ్యాధి లక్షణాలను నిర్మూలన విధానాలను వివరించారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్‌కుమార్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.విజయకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దోమల రహిత సమాజాన్ని స్థాపించాలి

ప్రజాశక్తి - భీమడోలు

దోమల రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు పి.అరుణజ్యోతి, ఆరోగ్య విస్తరణాధికారి వైవి.లక్ష్మణరావు కోరారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం పూళ్ల గ్రామంలో కొన్ని కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా పురవీధుల్లో సిబ్బంది, గ్రామ ప్రముఖుల భాగస్వామ్యంతో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యులు దోమల వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు.

ఏలూరు సిటీ : మానవ సమాజాన్ని మలేరియా మహమ్మారి నుంచి కాపాడిన మహనీయుడు డాక్టర్ సర్ రోనాల్డ్ రోస్ అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శోభ చెప్పారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా రోనాల్డ్ రోస్ చిత్రపటానికి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించి అనంతరం స్థానిక ఏలూరు కోటదిబ్బ కస్తూరిబా మున్సిపల్ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ నిర్వహించి బహుమతులు అందించారు. ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హెచ్‌డబ్ల్యూసి నోడల్ అధికారి డాక్టర్ రోహిత్, యుపిహెచ్‌సి జెపి కాలనీ వైద్యాధికారి డాక్టర్ నీలిమ, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఎంపిహెచ్ఇఒ ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు జైనాభి, పూర్ణ, మాణిక్యం, విమల పాల్గొన్నారు.

ముంపు నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - మండవల్లి

ముంపు నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పెద్దాడ్లగడి వంతెన వద్ద మేటవేసుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి ముంపు నీరు కొల్లేరుకు చేరుతున్న దృష్ట్యా కొల్లేరు పరివాహక ప్రాంతాల గ్రామాలకు ఇబ్బందులు తలెత్తకుండా సొంత నిధులతో గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు చేపట్టి నిర్వహిస్తున్నామన్నారు. కొల్లేరు ముంపు తీవ్రత అదుపులోనే ఉందని, ఎవరూ భయాందోళన చెందవద్దని చెప్పారు. ఉప్పుటేరు వంతెన వద్ద కాలువల వద్ద మేటవేసుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు మరో రెండు పొక్లెయిన్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి కృష్ణ, పర్యాటక శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, తదితరులు పాల్గొన్నారు.

13న మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబర్ 13వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కోరారు. బుధవారం కోర్టు ఆవరణలో పోలీస్ ఆఫీసర్స్‌తో లోక్ అదాలత్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సిఐ టి.క్రాంతికుమార్, చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్, చింతలపూడి, టి.నర్సాపురం, ధర్మాజీగూడెం, తడికలపూడి ఎస్ఐలు, కోర్ట్ కానిస్టేబుళ్లు, కోర్టు సూపరింటెండెంట్ పి.గుర్వినాయుడు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని తుక్కులూరు గ్రామంలో బైపాస్ రోడ్డు సమీపంలో రవాణా శాఖ అధికారులు బుధవారం భారీ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ఉప రవాణా అధికారి అన్నపూర్ణ మాట్లాడుతూ సామర్థ్యానికి మించి వాహనాలను తరలించడం చట్ట విరుద్ధమన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉండాలన్నారు. నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానాలతో పాటు శిక్షలు తప్పవని ఘాటుగా హెచ్చరించారు.

అంబుల వైష్ణవికి మంత్రి ప్రశంసలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

యువత, ప్రజలు తమ ఆర్థిక స్తోమత బట్టి విరాళాలు అందించి రాజధాని అమరావతి నిర్మాణంలో పాలు పంచుకోవాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి పిలుపునివ్వడం అభినందనీయమని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. వైష్ణవి, డాక్టర్ అంబుల మనోజ్‌లు సిఆర్‌డిఎ కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి నారాయణను బుధవారం కలిశారు. అమరావతి అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.116 సాయం చేయాలని ప్రయత్నం చేయడంతో విశేష స్పందన వస్తుందని రాష్ట్ర మంత్రి నారాయణ వైష్ణవిని ఈ సందర్భంగా అభినందించారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో వైసిపి ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోకపోవడంతో ప్రజలు మూడేళ్లుగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి

మంత్రితో మాట్లాడుతున్న వైష్ణవి

ఏర్పడిందన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా నుంచి ఏలూరు జిల్లాలోకి మార్చారని, దీంతో పరిపాలనలో స్పష్టత కొరవడిందని, భౌగోళికంగా, పరిపాలనా పరంగా ఇబ్బందులు తప్పడం లేదని చెప్పారు. ముదినేపల్లి, మండవల్లి మండలాలను కృష్ణా జిల్లాలోకి మార్చాలని కోరుతూ మంత్రి నారాయణకు వైష్ణవి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల పరిస్థితిని మంత్రి నారాయణకు వివరించారు.

వైద్యులు రవికిరణ్, హేమలత సేవలు ఆదర్శనీయం


మందులు అందిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకానికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి వైద్య సేవలందిస్తున్న కంటి వైద్య నిపుణులు రవికిరణ్, హేమలత సేవలు ఆదర్శనీయమని చాటపర్రు గ్రామ ప్రముఖులు గుత్తా కాశిబాబు, సొసైటీ అధ్యక్షులు కాలారి శ్రీనివాసులు అన్నారు. ఏలూరు రూరల్ చాటపర్రు గ్రామం ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశిబాబు మాట్లాడుతూ రవికిరణ్ కంటి ఆసుపత్రి వైద్యనిపుణులు విలువైన సమయాన్ని కేటాయించి ఈ విధమైన ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సొసైటీ బ్యాంకు ప్రెసిడెంట్ కాలారి శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా కంట పరీక్షలు చేసి మందులు అందించడం సంతోషదాయకమన్నారు. డాక్టర్ రవికిరణ్, డాక్టర్ హేమలత మాట్లాడుతూ కళ్లను సంరక్షించుకోవాలన్నారు. చాటపర్రు పరిసర గ్రామ ప్రాంతాల నుంచి 220 మందికి పైగా వైద్య సేవలు పొందారు. 26 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. 32 మందికి కళ్లద్దాలు మార్పిడి చేశారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం ప్రెసిడెంట్ ముల్పూరి వీరభద్రరావు, టిడిపి చాటపర్రు గ్రామ ప్రెసిడెంట్ పాతూరి నాని, పార్టీ యూనిట్ ఇన్‌ఛార్జి కొల్లిపర శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెంలో బుధవారం సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షులుగా మానికల నాగేశ్వరరావు, సభ్యులుగా పాతూరు అంబేద్కర్, దుర్గ వరప్రసాద్‌లతో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

బయోమెట్రిక్ ద్వారానే యూరియా విక్రయించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రైతులందరికీ బయోమెట్రిక్ విధానం ద్వారానే యూరియాను విక్రయించాలని, యూరియా అమ్మకాలతో ఎటువంటి ఉత్పత్తులను ముడి పెట్టరాదని, తాము కొనుగోలు చేసిన ఎరువులకు రైతులందరూ తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారిణి జె.భవాని అన్నారు. మండల పరిధిలోని అడవినెక్కలం, ఈదర, నరశింగపాలెం, కృష్ణవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో జరుగుతున్న యూరియా అమ్మకాలను ఆమె పరిశీలించి, పిఎసిఎస్ సిఇఒలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంశంపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్.బేబీకమల, సిబ్బంది, చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్ విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.బ్యూలా, సూపర్‌వైజర్‌చే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలకు, పుట్టిన పిల్లలకు కలిగే ఇబ్బందుల గురించి వివరించారు. ఉమెన్ ఎంపవర్ మెంట్ సెల్ కోఆర్డినేటర్ సిహెచ్.రమాదేవి, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.మధు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అభినందనీయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలోని శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యువభారత్, ఆనంద మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ జన్మనిచ్చిన కన్నతల్లి పేరిట మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ఎంతో అభినందనీయమన్నారు.తొలుత పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై ప్రతిజ్ఞ చేశారు.

నాపై దుష్ప్రచారం తగదు : పెదవేగి ఎంఇఒ-1

ప్రజాశక్తి - దెందులూరు

ఉపాధ్యాయుని మార్పు విషయంలో తనపై అసత్య ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నట్లు పెదవేగి ఎంఇఒ-1 బి.త్రిపురసుందరిదేవీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెదవేగి హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం కామర్స్ చెప్పే ఉపాధ్యాయులు లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారని, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దల అభ్యర్థన మేరకు పరిశీలించి పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని ఇంటర్ ద్వితీయ సంవత్సరం కామర్స్ బోధించడం కోసం ఒక ఉపాధ్యాయుని సర్దుబాటు చేశామని తెలిపారు. సదరు ఉపాధ్యాయునికి బదులుగా ఆ పాఠశాలలో వేరొక ఉపాధ్యాయులను ఎఫ్-1 పరీక్షల అనంతరం సర్దుబాటు చేస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయునికి, అక్కడి పేరెంట్స్ కమిటీ ఛైర్మన్‌కు తెలియజేశామని పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో తనను ఎటువంటి వివరణ కోరకుండా, తనను సంప్రదించకుండా కొందరు తనపై పత్రికా ప్రకటన ఇచ్చారని తెలిపారు. ప్రకటన చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు.

పెదవేగి జడ్‌పి ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఉపాధ్యాయుని సర్దుబాటు విషయంలో పెదవేగి ఎంఇఒ-1 నిర్ణయాన్ని ఏకపక్షంగా తప్పు పడుతూ దాన్ని పత్రికా ముఖంగా ఆరోపణలు చేయడం తగదని ఎస్‌టియు పెదవేగి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పరసా నాగార్జున, తాతపూడి ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఎంఇఒను వివరణ కోరాలని తెలిపారు.

'మానవత' సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయం

భీమడోలు :భీమడోలు మానవత సంస్థ చేపడుతున్న సంక్షేమ, సేవా కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. శాఖ పరిధిలోని పలు గ్రామాల్లో మానవత సంస్థ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగే కార్యక్రమంలో భాగంగా భీమడోలులో బుధవారం శాంతిర్యాలీ నిర్వహించారు. భీమడోలులోని ప్రభుత్వ, ప్రయివేట్ వైద్యశాలలో రోగులకు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. సంస్థ జిల్లా కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.గంగాధరరావు, భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రష్మితో ఆరోగ్య కేంద్రం అభివద్ధికి అవసరమైన వసతులు, ఇతర అంశాల గురించి చర్చించారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) : AT BHIMADOLE

E.P.8/2021 in O.S.67/2017

Between:

మండ ప్రసాదు ...DHR/Plaintiff

Vs

పూజారి ప్రసాదు ...JDr/Defendant

To.

పూజారి ప్రసాదు, S/o.శ్రీనివాస్,

R/o.గాలాయిగూడెం, దెందులూరు మండలం.

పై గ్రంథంలో DHR మీపై అరెస్టునకు EP దాఖలు చేసినందున శ్రీకోర్టు వారు Order 21 Rule 22 నోటీసులు జారీ చేసిఉన్నారు. కావున JDR పూజారి ప్రసాదు అను వారు పైకోర్టులో ది.28-8-2025వ తారీఖున ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కాని, ప్లీడరు గారి ద్వారా కాని హాజరై తమ ఆక్షేపణలు తెలియపరచుకొనవచ్చును. లేని యెడల సదరు పిటిషన్ తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

డి.సత్యన్నారాయణ
భీమడోలు ఎస్.గోపాలకృష్ణ
తేది. 16-08-2025 అడ్వకేట్స్, భీమడోలు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

A R B NO. 498 of 2024.

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,
Represented by its Divisional Legal Officer, KARIMNAGAR, Branch, V Ramesh S/o Kanakaiah Aged about 33 Years, R/o. Karimangar.
...Disputant

VERSUS

Theeda Sai Lokesh & Others
1. Theeda Sai Lokesh S/o. Srihari Apparao Age: 30years, Occ: Points Man-A, South Central Railway Department, Ramagundam, R/o. Q.No.68/1 Akbar Nagar, Railway Quarters, Ramagundam, Godavarikhani.
2. Ellandula Venkatesh S/o. Komuraiah Age: 31years, Occ: Points Man-A, Sourth Central Railway Department, Ramagundam, R/o. H.No. 1-131, Railway Colony, Sirpur, Adilabad.
5. Renikuntla Harish S/o. Vijayagiri Age: 33years, Occ: Asst. (Ele/TRO) South Central Railway Department, Ramagundam, R/o. H.no. 4-86, Ashok Nagar, Kundanpalli, Ramagundam, Godavarikhani.
7. Chintha Srinivas S/o. Anjaiah Age: 42years, Occ: Points Man (OPT), South Central Railway Department, Ramagundam, R/o. H.no. 13-787, Sanjeevaiah Colony, Madhari Wada, Bypass Road, Mancherial.
8. Prattipati kamala priya w/o. Sai lokesh age: 28years, occ: counsellor and accountant global sparks e/M school, r/o. H.No. 3-68/1, bedta veedhi, polavaram, west godavari.
... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 28-08-2025 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION KARIMNAGAR

స్థిరాస్థి వేలం ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు

ఇ.పి.నెం.78/2016 ఇన్

ఎఎ/సిఎఫ్/నెం.139 ఆఫ్ 2015

బిట్వీన్ :
మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, భీమవరం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచి మేనేజర్
...డిక్రీ హోల్డర్
And
ఆచంట నాగ సత్యశ్రీనివాస ప్రభాకర్ & 6 Others
...జడ్జిమెంట్ డెబిటార్స్

1వ జెడిఆర్ : ఆచంట నాగ సత్య శ్రీనివాస ప్రభాకర్, తండ్రి నర్సింహారావు, డో.నెం.17-1-245, అయ్యగారి వారి వీధి, రుస్తుంబాద, నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరులో డిక్రీ వసూలు నిమిత్తం 1వ జెడిఆర్ తాలూకు ఈ క్రింది తెలిపిన ఇపి షెడ్యూలు దాఖలా స్థిరాస్థులను (1.2 అయిటమ్స్) **ది.04-09-2025**వ తేదీన పైకోర్టు వారి ఎదుట ఉదయం గం.10.30 ని॥లకు బహిరంగ వేలం జరుగునని తెలియపరచటమైనది. కావున వేలం పాటలో పాల్గొనువారు వేలం పాటలో పాల్గొనవచ్చును.

1వ జెడిఆర్‌కు చెందిన ప్రోపర్టీ షెడ్యూల్స్ వివరములు ఐటమ్ నెం.1 : పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం.124/2008 నర్సాపురం సబ్‌డివిజన్ మున్సిపల్ ఏరియా ఖాళీ స్థలం పాత 23వ వార్డు క్రొత్త 25వ వార్డు, రుస్తుంబాద రెవెన్యూ విలేజ్ దగ్గరలో పాత డో.నెం.16-3-27, క్రొత్త డో.నెం.16-3-69, సర్వే నెంబరు 617/2ఎలో గల చ॥గ॥316-3కు ఈ క్రింది సరిహద్దులు: **తూర్పు:** అ॥48.5 (6 అ॥లు) వై.వి.లక్ష్మణరావు, ఉమ్మడి మార్గం. **దక్షిణం:** అ॥58.5 ఎల్లా వెంకట లక్ష్మణరావు గారి స్థలం వగైరాలు. **పడమర:** అ॥48.0 ఎల్లా వెంకట లక్ష్మణరావు గారి స్థలం వగైరాలు. **ఉత్తరం:** అ॥ 59.5 (13 అ॥లు) వెడల్పు ప్రధాన వీధి.

డిక్రీ హోల్డర్ విలువ : రూ.10,00,000/-

మార్కెట్ విలువ : రూ.15,80,000/-

ఐటమ్ నెం.2 : పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం.585/2010, నర్సాపురం సబ్‌డివిజన్ మున్సిపల్ ఏరియా అయ్యగారి వీధి 27వ వార్డు, రుస్తుంబాద రెవెన్యూ విలేజ్ ఆర్.సి.సి బిల్డింగ్, డో.నెం. 17-1-245/3, సర్వేనెం.564/18లో గల చ॥గ॥159.8కు ఈ క్రింది సరిహద్దులు : **తూర్పు:** అ॥26.00 మున్సిపల్ రోడ్, **దక్షిణం:** అ॥49.00 దాసరి వెంకట లక్ష్మి గారి స్థలం వగైరాలు. **పడమర:** అ॥26.00 ఉమ్మడి మార్గం ఆకుల శేషయ్య ఇతరులు. **ఉత్తరం:** అ॥61.8 కోడూరి సుబ్బారావు గారి స్థలం.

డిక్రీ హోల్డర్ విలువ : రూ.25,00,000/-

మార్కెట్ విలువ : రూ.7,99,000/-

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

నర్సాపురం ఎం.సత్యకృష్ణ
తేది.20-08-2025 అడ్వకేట్,నర్సాపురం.